## ముగ్గురు సీఐలు బదిలీ

కర్నూలు క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు ఫ్యాక్షన్ జోన్ సీఐ ఎస్.చిరంజీవిని ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్‌కు బదిలీ చేయగా ఫ్యాక్షన్ జోన్‌కు కర్నూలు తాలూకా సీఐ శ్రీధర్‌ను బదిలీ చేశారు. అదేవిధంగా కర్నూలు ఎస్‌బీ సీఐగా ఉన్న ఎస్.తేజోమూర్తిని కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

## సిద్ధిదాయినిగా భ్రమరాంబికాదేవి


కైలాస వాహనంపై ఆది దంపతులు

శ్రీశైలం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా ఉత్సవాల్లో తొమ్మిదో రోజు అమ్మవారు సిద్ధిదాయినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రాతఃకాల పూజలు, విశేషకుంకుమార్చనలు, నవావరణార్చనలు నిర్వహించారు. స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్రపారాయణాలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా కుమారి పూజలు జరిపించారు. వాహనసేవలో భాగంగా స్వామి, అమ్మవారు కైలాస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు రమావాణీ సేవిత రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిస్తారు. అదేవిధంగా సాయంత్రం ఉత్సవమూర్తులకు అశ్వవాహన సేవ ఉంటుంది.

# మహా విషాదం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేర్వేరు ఘటనల్లో తొమ్మిది మంది దుర్మరణం
- మృత్యుపాశంగా మారిన రథశాల గోడ
- గుడికల్‌లో ముగ్గురి మృతి
- పత్తికొండలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యం..
- ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి మృతి
- నంద్యాలలో ఆటోను ఢీకొన్న మరో లారీ
- ఇద్దరు మృత్యువాత
- చిన్నటేకూరులో అతివేగం
- గొర్రెల కాపరిపై దూసుకెళ్లిన కారు


భూమిక, శ్రీనితిక (ఫైల్) శిరీష (ఫైల్) నాగరాజు (ఫైల్) లక్ష్మీనరసింహ (ఫైల్) రాజు (ఫైల్)


పత్తికొండ: ప్రమాదంలో నుజ్జయిన ఆటో

మరో రెండు రోజుల్లో దసరా పండుగ.. ఎటుచూసినా సందడి వాతావరణం.. ఇలాంటి తరుణంలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.. మహా విషాదాన్ని నింపాయి.. ఓవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు.. జన జీవనాన్ని అతలాకుతలం చేశాయి.. వానలకు తడిసిన ఓ గోడ ఆ కుటుంబం పాలిట మృత్యుపాశంగా మారింది. అందరూ గాఢ నిద్రలో ఉండగా ఒక్కసారిగా గోడ కూలింది. బతుకుదెరువు కోసం వలస వచ్చినవారు మృత్యువాత పడ్డారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రేషన్ బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బీభత్సాన్ని సృష్టించింది. వెనుక వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి దుర్మరణం చెందారు. పండుగ కోసం కొత్త బట్టలు కొనేందుకు వచ్చి వారు ప్రమాదం బారిన పడ్డారు. ఓ కారు డ్రైవర్ అతివేగం కారణంగా ఓ నిండు ప్రాణం, పలు మూగజీవాలు బలయ్యాయి. గొర్రెలను మేపేందుకు తీసుకురాగా కారు ఆగొర్రెల మందపై దూసుకు వచ్చింది. దీంతో 20 గొర్రెలతో పాటు గొర్రెల కాపరి సైతం మృతిచెందాడు. నంద్యాలలో ఓ లారీ డ్రైవర్ అతి వేగం కారణంగా మరో ఇద్దరు మరణించారు. ఈ వరుస ఘటనలతో ఆయా కుటుంబాల్లో విషాదం చోటుచేసుకుంది.


వివరాలు 5లో




## బాలబ్రహ్మేశ్వర స్వామికి పట్టువస్త్రాలు

- ఏపీ ప్రభుత్వం తరపున సమర్పించిన కర్నూలు కలెక్టర్


పట్టువస్త్రాలను సమర్పిస్తున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున తెలంగాణ రాష్ట్రంలోని అలంపూరు క్షేత్రంలో వెలసిన జోగుళాంబ సమేత బాలబ్రహ్మేశ్వరస్వామి, అమ్మవార్లకు కర్నూలు కలెక్టర్ డాక్టర్ సిరి పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళవారం కలెక్టర్ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా బాలబ్రహ్మేశ్వరస్వామి వారికి అభిషేకాలు చేశారు. కలెక్టర్‌కు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పట్టువస్త్రాల సమర్పణ అనంతరం వేద పండితుల వేదాశీర్వచనంతో తీర్థప్రసాదాలను అందజేశారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బి.సుధాకర్ రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


నందవరంలో దుర్గామాత అలంకారంలో దర్శనమిచ్చిన చౌడేశ్వరీమాత


కె.నాగలాపురంలో దుర్గాదేవి అలంకరణలో సుంకులాపరమేశ్వరి అమ్మవారు


గీతా మందిరంలో మహాకాళి అలంకరణ


కల్లూరు చిన్న అమ్మవారిశాలలో మహిషాసురమర్దిని అలంకరణ


భద్రావతి భావనారాయణ స్వామి ఆలయంలో దుర్గాదేవి అలంకరణ


మహానందిలో గ్రామోత్సవం

### సిద్ధిధాత్రిగా కామేశ్వరీదేవి

**మహానంది, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** మహానంది క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం కామేశ్వరీ దేవి సిద్ధిధాత్రి దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రావణ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. పదో రోజు బుధవారం ప్రత్యేకంగా అలంకరిస్తారు. రాత్రి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

## అసురమర్దిని.. అమృత వర్షిణి

**కర్నూలు కల్చరల్/ బనగానపల్లె/ గూడూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి జిల్లా వాసులు దసరా దేవీ శరన్నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో పుణ్యక్షేత్రాలు, అమ్మవారి మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. 9వ రోజు మంగళవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. కర్నూలు నగరంలోని మించిన్‌బజార్‌లో పెద్ద అమ్మవారిశాలలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. చిత్తారి వీధిలోని నిమిషాంబ అమ్మవారు సరస్వతీ దేవిగా గీతామందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారికి దుర్గాదేవిగా, కల్లూరులో వాసవీ మాత మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. బనగానపల్లె మండలం నందవరం చౌడేశ్వరీమాత మహాదుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. గూడూరు మండలం కె.నాగలాపురంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

### వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు

# అశ్వాలపై యాదవరాజులు

- ఒక్కరోజు రాజులుగా వ్యవహరించనున్న మూడు కుటుంబాల సభ్యులు
- విజయదశమిని పురస్కరించుకొని రేపు గుర్రాలపై స్వారీ
- పార్వేటకు సిద్ధమైన రాజవంశీకులు
- మద్దికెరలో నేటికీ కొనసాగుతున్న రాచరిక సంప్రదాయం


అశ్వాలపై సైన్యంతో వెళ్తున్న యాదవరాజులు (ఫైల్)

**మద్దికెర, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** మద్దికెరలో విజయదశమి రోజున రాజవంశీకులు అశ్వాల పార్వేట నిర్వహిస్తూ వస్తున్నారు. అలాగే ఈ ఏడాది పెద్దనగిరి, చిన్ననగిరి, యామన్ననగిరి అనే మూడు కుటుంబాలకు చెందిన వారు ఒకరోజు రాజులుగా వ్యవహరిస్తూ రాచరికపు సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఈ మూడు కుటుంబాల పూర్వీకుల ఆచార సంప్రదాయంలో అశ్వాల పార్వేట ఒకటి. యాదవరాజుల వంశీకులు దసరా పండుగ రోజున తలపాగా ధరించి రాచరికపు వస్తువులు, ఖడ్గాలు, మేళతాళాలు, సైనికులతో గుర్రాలపై మద్దికెరకు 3 కిలోమీటర్ల దూరంలోని నాటి యాదవరాజు నిర్మించిన బొజ్జనాయనపేటలోని భోగేశ్వర ఆలయానికి వెళ్తారు. ఇక్కడ పూజలు నిర్వహించి తిరిగి మద్దికెరకు చేరుకుంటారు. యాదవరాజులు గ్రామం నుంచి బయలుదేరేటప్పుడు మద్ది కులస్థులు సైన్యంలా ఆయుధాలు ధరించి అంగరక్షకులుగా గ్రామ శివార్ల వరకు వెళ్తారు. బొజ్జనాయనపేటలోని భోగేశ్వరస్వామి ఆలయంలో ఈ మూడు కుటుంబాల వారు పూజలు నిర్వహించిన అనంతరం మద్దికెరకు గుర్రాలపై స్వారీ చేసుకుంటూ వస్తారు. ఈ పోటీల్లో మొదటిగా వచ్చిన వారు విజయం సాధించినట్లుగా వేడుకలు చేసుకుంటారు. పూర్వం నుంచి యాదవరాజులుగా పిలువబడి పాలేగాళ్లుగా వ్యవహరించిన వాళ్లకు ప్రభుత్వం పింఛన్ ఇవ్వడం చెప్పుకోదగ్గ విషయం. గురువారం విజయదశమి రోజు సాయంత్రం మద్దికెరలో.. దేశంలో ఎక్కడా లేని విధంగా గుర్రాల పార్వేట జరుగుతుంది. సంప్రదాయ ప్రకారం సాయంత్రం గుర్రాల పారువేట ఉంటుందని యాదవరాజులు తెలిపారు.

# సమరం కాదు... సంబరం

- సంప్రదాయానికే ప్రాధాన్యం ఇస్తున్న అధికార యంత్రాంగం
- గ్రామాల్లో విస్తృతంగా అవగాహన
- ఉత్సవాల్లో హింసను తగ్గించడానికి ప్రణాళిక
- రేపే దేవరగట్టు బన్నీ ఉత్సవం


బన్నీ ఉత్సవంలో పాల్గొన్న ప్రజలు (ఫైల్)

**ఆలూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ఆలూరు నియోజకవర్గంలోని హొళగుంద మండలంలోని దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయంలో దసరా పండగ రోజు అర్ధరాత్రి రోజు జరిగే బన్నీ ఉత్సవం కలెక్టర్ డాక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు సవాలుగా మారింది. ప్రభుత్వ యంత్రాంగం, పోలీసుశాఖ కర్రలు, మద్యం నియంత్రణకు ఎన్ని అవగాహన సదస్సులు, ముందస్తు చర్యలు చేపట్టినా ఉత్సవం రోజున షరా మాములుగానే వేలాది మంది భక్తులు కర్రలతో ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. గతంలో ఉత్సవాల్లో జరిగిన మరణాలు, జరిగిన దాడులు, భక్తులకు గాయాలపై రాష్ట్ర మానవహక్కుల కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఉత్సవాల్లో జరుగుతున్న హింసపై అప్పటి కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు కూడా జారీ చేసింది. అప్పటి నుంచి ప్రభుత్వం ఈ ఉత్సవాన్ని సీరియస్‌గానే పరిగణించింది. ఏటా ఈ ఉత్సవాలపై పది రోజుల ముందు చర్యలు చేపట్టి అవగాహన సదస్సులు కూడా నిర్వహించారు. ఇప్పటికే కలెక్టర్ సిరి, ఎస్పీ స్వయంగా దేవరగట్టును సందర్శించి బన్నీ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలని పరిసర గ్రామాల పెద్దలకు సూచించారు. బన్నీ ఉత్సవం కర్రల సమరం కాదని... సంప్రదాయం అని, మీ ఆచారాలకు, కట్టుబాట్లకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని.. భక్తిమాటున జరిగే వ్యక్తిగత కక్షలకు వేదిక కాకూడదని పోలీసులు చెబుతున్నారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచిస్తున్నారు.

### రింగు కర్రలు స్వాధీనం



ఆలూరు సర్కిల్ కార్యాలయంలో పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. దేవరగట్టు ఉత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అరికేర గ్రామంలో సోదాలు నిర్వహించగా మారుణాయుధాలు, ఇనుప రింగులు తొడిగిన కర్రలను స్వాధీనం చేసుకుని, ఐదుగురిపై మారుణాయుధాల చట్టం కింద కేసులు నమోదు చేశామన్నారు. హింసకు తావు లేకుండా ఉండేందుకు 200 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి ఉన్నారు. నాటుసారా నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

### మద్యం నియంత్రణకు చర్యలు

బన్నీ ఉత్సవంలో ప్రధానంగా మదయం మత్తులో కర్రలు తీసుకుని వెళ్లడం వల్ల అదుపు తప్పి దెబ్బలు తగులుతున్నాయని ప్రభుత్వం గుర్తించింది. దీంతో కర్ణాటక, ఏపీ మద్యంతో పాటు నాటుసారాను నియంత్రించాలని కలెక్టర్, ఎస్పీ పోలీసు ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు.

### 200 మంది బైండోవర్

దేవరగట్టు ఉత్సవాల సందర్భంగా అరికేర, ఎల్లార్తి, నెరణికి, నెరణికితండా, కొత్తపేట, అరికెర, అరికెరతండా, హెబ్బటం పరిసర గ్రామాల్లో గతంలో ఉత్సవాల్లో అల్లర్లు, ఘర్షణలు, అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన వారిని గుర్తించి ఇప్పటికే 200 మందిని బైండోవర్ చేశారు. మరికొందరిపై మందిపై కూడా నమోదు చేయనున్నట్లు ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు.

### ప్రత్యేక నిఘా

ఉత్సవాల్లో కొందరు భక్తుల మాటున ఆకతాయిలు భక్తులపై అగ్గి కాగడాలు విసురుతూ భక్తులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. అలాగే ఉత్సవాల్లో కర్రలు పట్టుకుని అత్యుత్సాహం ప్రదర్శించే వారిని గుర్తించేందుకు వీలుగా భారీ లైటింగ్, డ్రోన్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలకు ఇనుప రింగులు తొడిగిన కర్రలు, మారుణాయుధాలు తీసుకురాకుండా గ్రామాల్లో ఇనుప రింగులు తొడిగిన కర్రల కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఇళ్లల్లో సోదాలు నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. మారుణాయుధాలు కలిగి ఉన్న వారిపై కేసులు కూడా నమోదు చేశారు. ఉత్సవాల్లో గాయాలైన వారి కోసం వైద్య సిబ్బందిని అంబులెన్స్, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. అగ్నిమాపక వాహనాలను సిద్ధం చేస్తున్నారు.

---

# చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

## విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

## కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

## శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

## సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

## ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

## రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

## జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.

# మహా విషాదం

**• వేర్వేరు ఘటనల్లో ఏడుగురి దుర్మరణం**

**ఉమ్మడి జిల్లాలో చోటుచేసుకున్న వరుస ఘటనల్లో తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. పొట్ట కూటి కోసం వలస వచ్చిన ఓ కుటుంబంలో ముగ్గురు గోడ కూలి అనంత లోకాలకు చేరారు. ఈఘటన ఎమ్మిగనూరు మండలం గుడికల్‌లో చోటు చేసుకుంది. ఈఘటనను చూసిన ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. అలాగే ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం మూడు ప్రాణాలను బలిగొంది. రేషన్ బియ్యం లారీ అదుపు తప్పి ఆటోపైకి దూసుకు వచ్చింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి అనంత లోకాలకు చేరారు. అలాగే ఓ కారు డ్రైవర్ అతివేగానికి ఓ నిండు ప్రాణం, 20 మూగ జీవాలు బలయ్యాయి. నంద్యాలలో ఓ లారీ ఆటో ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృత్యువాత పడ్డారు.**

## పొట్ట కూటి కోసం వచ్చి..

**• మృతులు నందవరం వాసులు**



గుడికల్‌లో కూలిన రథశాల గోడ

**ఎమ్మిగనూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):** పొట్ట కూటి కోసం ఆ కుటుంబం వలస వచ్చింది. ఓ గుడిసెను అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. వారు నివసించే గుడిసె ఓ రథశాల గోడల మధ్య ఏర్పాటుచేశారు. ఆ గోడలే వారి పాలిట మృత్యుపా శాలు మారాయి. నాలుగైదు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలకు తడిసిపోయిన పురా తన రథశాల గోడ కుప్పకూలి ఆగుడిసెపై పడింది. అందులో నిద్రిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. మృతుల్లో అన్నదమ్ములు, కొడుకు ఉన్నారు. ఎమ్మిగనూరు మండలం గుడికల్‌లో సోమవారం అర్ధరాత్రి ఈఘోర దుర్ఘటన చోటుచేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. మం డల కేంద్రమైన నందవరానికి చెందిన బోలదూరు లక్ష్మి, ఆమె తనయులు నాగరాజు (39), రాజు(32) కొన్నేళ్ల క్రితం గుడికల్ వలస వచ్చారు. రామమ్మపేట వీధిలో రథశాలగోడల మధ్యలో ఉన్న ఓగుడిసెను అద్దెకు తీసుకున్నారు. చిన్న చిన్న పనులు చేస్తూత జీవనం సాగించేవారు. నాగరాజు కుమారుడు లక్ష్మీనరసింహ(15) గ్రామంలోని పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం సైతం పనులకు వెళ్లి వచ్చిన వారు భోజనం చేసి గుడిసెలో తల్లి లక్ష్మి, తనయులు నాగరాజు, రాజు, లక్ష్మీనరసింహ నిద్రించారు. అర్ధరాత్రి ఉన్నట్టుండి ఒక్క సారిగా రథశాల తూర్పువైపు ఉన్న గోడ కుప్పకూలి గుడిసెపై పడింది. నిద్రిస్తున్న వారిపై రాళ్లు పడటంతో గాయాలయ్యాయి. నాగరాజు, అతని కొడుకు లక్ష్మీనరసింహకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. రూరల్ పోలీసులకు హుటాహుటిన సమాచారం అందింది. వారు చేరుకొని అంబులెన్స్‌ను రప్పించి రక్తగాయాలతో ఉన్న రాజు, లక్ష్మిని ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజు కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. తల్లి లక్ష్మి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుం టుందని భరోసా ఇచ్చారు. గోడ కూలిన సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు, కొడుకు ముగ్గురు మృతి చెందటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## గొర్రెల మందపై దూసుకొచ్చిన కారు



సంఘటనా స్థలంలో పోలీసులు, స్థానికులు

**కర్నూలు క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ఓ కారు డ్రైవర్ అతివేగానికి ఓ నిండు ప్రాణం, 20 మూగజీవాలు బలయ్యాయి. ఈ ఘటన ఉలిందకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని చిన్నటేకూరు సమీపంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కల్లూరు మండలం బస్తిపాడు గ్రామానికి చెందిన కురువ రాముడు(34) అనే వ్యక్తి తన గొర్రెలను రోడ్డు దాటించేందుకు చిన్నటేకూరు సమీపంలో రోడ్డుకు ఓ పక్కగా నిలబడ్డాడు. హైదరాబాదు వైపు నుంచి బెంగళూరు వెళ్తున్న ఓకారు అతివేగంతో డివైడర్‌ను దాటుకుని ఇవతలివైపు ఉన్న కురువ రాముడు, ఆయన గొర్రెల మందపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 20 గొర్రెలతో పాటు రాముడు మృత్యువాత పడ్డాయి. కారులో ఉన్న వేణుగోపాల్ అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మరో 22 గొర్రెలు గాయపడ్డాయి. మృతుడికి భార్య అనిత, నలుగురు కూతుళ్లు సంతానం ఉన్నారు. ఘటనాస్థలికి హుటాహుటిన రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ ధనుంజయ్ చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. టీడీపీ సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మంత్రి భరత్, ఎంపీ బస్తిపాటి దిగ్ర్భాంతి**

**కర్నూలు అర్బన్:** ఎమ్మిగనూరు, పత్తికొండలో చోటుచేసుకున్న ప్రమాద ఘటనలపై పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మంగళవారం దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. రెండు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందడం ఎంతో బాధ కలిగించిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కూడా విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## అదుపు తప్పి ఆటోపైకి దూసుకొచ్చిన లారీ

**• మృతులు తుగ్గలి మండలం ముక్కెళ్ల వాసులు**



తీరని వేదన.. భార్య మృతదేహం వద్ద..

**పత్తికొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** రేషన్ బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పింది. వెనుక వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి దుర్మరణం చెందారు. ఈ హృదయ విదారక ఘటన కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణంలోని గుత్తి రోడ్డు మంగళవారం మధ్యాహ్నం చోటుచేసు కున్నట్లు సీఐ జయన్న తెలిపారు. వివరాలు.. ఆదోని సివిల్‌సప్లై గోడౌన్ నుంచి రేషన్‌బియ్యం లోడ్‌తో లారీ బయలుదేరింది. పత్తికొండకు చేరుకున్న సమయంలో ఇంజన్ ఆగిపోయింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని ముందుకు నడిపాడు. పంచాయతీరాజ్ కార్యాలయం దాటాక ఎత్తు ప్రాంతంలో లారీ ఇంజన్ నిలిచిపోయింది. ఆ ప్రాంతం తగ్గుగా ఉండటంతో లారీ అదుపు తప్పింది. వెనుక వైపునకు దూసుకుపోతూ రోడ్డుపై అడ్డు వచ్చిన తాకుతూ సుమారు 100మీటర్లు వెనక్కి వచ్చింది. సాయిబాబా ఆలయం గేటు వద్ద ప్రయాణికులతో నిలిచి ఉన్న ఆటోను ఢీకొట్టింది. ఆటో నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు ఎక్స్‌కవేటర్ ద్వారా లారీ తొలగించి ఆటోలో చిక్కుకున్న మృతదేహాలను బయ టకు తీశారు. పత్తికొండ ప్రభుత్వాస్పత్రికి మృతదేహాలను తరలించారు. మృతులు తుగ్గలిమండలం ముక్కెళ్లకు చెందిన తల్లికూతుళ్లు భూమిక(25) శ్రీనితిక(5) అదే గ్రామానికి చెం దిన శిరీష(25)గా గుర్తించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణం గానే ప్రమాదం చోటుచేసు కున్నట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తిం చారు. మృతిచెందిన మహిళలకు దసరా పండుగకు పిల్లలకు బట్టలుకొనేం దుకు వచ్చి మృత్యువాత పడినట్టు గ్రామస్థులు తెలిపారు. తల్లి, అక్కతో పాటు ఉన్న భూమిక కుమారుడు రెండేళ్ల తులసి రాం సురక్షితంగా బయటపడ్డాడు. మరో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతు న్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



కూతురి మృతదేహంతో తండ్రి



అంబులెన్స్‌లో తరలుతున్న మృతదేహాలు

## ఆటోను ఢీకొట్టిన లారీ

**• ఇద్దరి మృతి, నలుగురికి తీవ్రగాయాలు**

**నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ఓ లారీ అదుపు తప్పి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి పట్టణంలోని రైతునగరం సమీపంలో చోటుచేసుకున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వివరాలు.. నూనెపల్లె నుంచి చాకరాజువేములకు వెళ్తుండగా ఆటోలో స్వగ్రామాలకు వెళ్లేందుకు నూనెపల్లె వద్ద ఆటో ఎక్కారు. నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన రాజమ్మ, లక్ష్మిదేవి, ఈశ్వర్, చాకరాజువేములకు చెందిన కరీముల్లా, వసురుపాడుకు చెందిన రమణ ఆటోలో ఉన్నారు. ఈశ్వర్(21), కరీముల్లా(35) నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో మృతిచెందారు. ఈఘటనలో రమణ, రాజమ్మ, లక్ష్మీదేవి ఆటో డ్రైవర్ మాబువుశేన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి, ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా లారీ డ్రైవర్ మద్యం సేవించి ఉన్నట్లు తెలిసింది.

**అందుబాటులో లేని అంబులెన్స్...**

రైతునగరం వద్ద రోడ్డు ప్రమాదం జరగగా స్థానికులు అంబులెన్స్‌ల కోసం తీవ్ర ప్రయత్నం చేశారు. కాగా అంబులెన్స్‌లు అందుబాటులో లేకపోవడంతో అటు వైపుగా వెళ్తున్న త్రీటౌన్ సీఐ కంబగిరి రాముడు స్థానికుల సహాయంతో స్వయంగా క్షతగాత్రులను ఆటోలో ఎక్కించి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

## త్రుటిలో తప్పిన ప్రమాదం

**• బస్సులోని 60 మంది ప్రయాణికులు సురక్షితం**



రోడ్డుపక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

**సంజామల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):** తాడిపత్రి నుంచి కోవెలకుంట్లకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సంజామల పెండేకటి నగర్ వద్ద అదుపు తప్పింది. సంజామలలో డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ఒక వైపు రోడ్డు క్యూరింగ్ పనులు చేసి బురదను తొలగించారు. ఇదే క్రమంలో మంగళవారం ఉదయం కోవెలకుంట్ల డిపో చెందిన ఆర్టీసీ బస్సు పెండేకంటి నగర్ మలుపు వద్ద అదుపు తప్పింది. 60మంది ప్రయాణికులతో ఫుల్‌గా ఉన్న బస్సు ఒకేసారి అదుపుతప్పి బోల్తాపడే క్రమంలో కొబ్బెరి చెట్టు అడ్డంగా ఉండటంతో బస్సు నిలబడి పోయింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. ఎస్ఐ రమణయ్య ఆధ్వర్యంలో బస్సును రోడ్డుపై చేర్చారు. ప్రయాణికులు సురక్షితంగా వారి గమ్యస్థానాలకు వెళ్లారు.

## వాగులో పడి యువకుడి మృతి

**కోవెలకుంట్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ప్రమాదవశాత్తూ వాగులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిన్నవంచెన వాగు వద్ద మంగళవారం చోటుచేసుకున్నట్లు సీఐ హనుమంతునాయక్, తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామానికి చెందిన జమాల్ బాషా(20) అనే యువకుడు సంజామల మండలం ముదివేడు గ్రామానికి బైక్‌పై వచ్చాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి బిల్లలాపురం గ్రామానికి వల్లంపాడు మీదుగా వెళ్తున్నాడు. లింగాల- వల్లంపాడు గ్రామా ల మధ్య ఉన్న చిన్నవంచన వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. అతడు వాగు దాటుతుండగా బైకు అదుపు తప్పి కిందపడి కొట్టుకుపోయాడు. పక్కనే ఉన్న స్థానికులు గమనించి వల్లంపాడుకి చెందిన తలారికి సమాచారమిచ్చారు. తహసీల్దార్, సీఐ, ఎస్ఐలు ఘటనాస్థలికి చేరుకొని గజ ఈతగాళ్లను పిలిపించారు. వారు రెండు గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టగా జమాల్‌బాషా మృతదేహం, బైకు లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మునీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు.

## రైలు పట్టాలపై తల పెట్టి ఆత్మహత్య

**డోన్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** రైలు పట్టాలపై తలపెట్టి ఓ గుర్తు తెలియని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం డోన్ రైల్వేగేటు సమీపంలో చోటుచేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ బిందు మాధవి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని రైల్వేగేటు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి కర్నూలు నుంచి నంద్యాల వెళ్లే డోన్ రైలు కింద రైలు పట్టాలపై తల పెట్టి ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఈ ఘటనలో అతడి తల, మొండెం వేరైంది. ఈ విషయాన్ని గమనించిన లోకో పైలట్ డోన్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. కుడి చేతి ముంచేతిపై ఆంజనేయస్వామి పచ్చబొట్టు, ఎడమ చేయి భుజంపైన శివమణి పచ్చబొట్టు ఉన్నాయన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు జీఆర్‌పీ ఎస్ఐ సెల్ నెంబరు 9030481295ను సంప్రదించాలన్నారు.

## ముగ్గురు సీఐల బదిలీ

**కర్నూలు క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు రేంజ్ పరిధిలో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు ఫ్యాక్షన్ జోన్‌లో పనిచేస్తున్న ఎస్. చిరంజీవిని ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్‌కు, కర్నూలు తాలుకా యూపీఎస్‌లో పనిచేస్తున్న ఎం.శ్రీధర్‌ను ఫ్యాక్షన్ జోన్‌కు అలాగే డీఎస్‌బీ-1, కర్నూలులో పనిచేస్తున్న ఎస్.తేజ మూర్తిని కర్నూలు తాలుకా యూపీఎస్‌కు డీఐజీ బదిలీ చేశారు.

## ఆదోనిలో 'రామ్‌రాజ్' షోరూం

**ఆదోని, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** వస్త్ర ప్రపంచంలో గుర్తింపు పొందిన 'రామ్ రాజ్ కాటన్' సంస్థ కర్నూలు జిల్లా ఆదోనిలో నూతన షోరూం ఏర్పాటు చేసింది. జీహెచ్ రోడ్డులో ఉన్న ఆరియా హాస్పిటల్ సమీపంలో ఏర్పాటైన ఈ షోరూంను పూరవర్గ మాత జంగమర హొసహళ్లి షట్‌స్థల బ్రహ్మ అజత శంభులింగ శివాచార్య స్వామితో కలసి సంస్థ చైర్మన్ కేఆర్ నాగరాజన్ లాంఛనంగా ప్రారంభించారు. ఎస్‌బీ దివాకర్‌గౌడ్ దీప ప్రజ్వలనం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రామ్‌రాజ్ కొత్తగా యాంటీ బాక్టీరియల్ ధోతీలను ఆవిష్కరించిందన్నారు. తమ ఉత్పత్తులన్నీ మృదువైన కాటన్ దుస్తులతోనే తయారు చేయబడతాయని, వీటిని వస్త్రరంగంలో నిపుణులు రూపొందించి విక్రయిస్తారని వివరించారు.



షోరూంను ప్రారంభిస్తున్న శివాచార్య స్వామి

## ఉత్తరాంధ్రలో 'సామా' ప్రభంజనం

**• విజయవాడ ఉత్సవ్, తెనాలి పోటీల్లో ప్రదర్శన**



బుర్రా సాయిమాధవ్ నుంచి సత్కారం అందుకుంటున్న పత్తి ఓబులయ్య

**కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** రాయలసీమలో పురుడుపోసుకున్న 'జగదేకసుందరి సామా' నాటకం ఉత్తరాంధ్రలో ప్రభంజనం సృష్టించింది. విజయవాడ, తెనాలి పరిషత్ పోటీల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన 'సామా' చారిత్రక పద్య నాటకాని విశేష ఆదరణ లభించింది. సోమవారం రాజధానిలో 'విజయవాడ ఉత్సవ్'లో తొలి ప్రదర్శన ఇచ్చారు. రెండున్నర గంటల పాటూ సాగే ఈ నాటకాన్ని ప్రేక్షకులు ఉత్కంఠభరితంగా తిలకించారు. రాయలసీమ నుంచి ప్రదర్శితమైన ఈ నాటక ప్రదర్శన ప్రజా ప్రతినిధులను, అధికారులను కూడా మెప్పించిందని నాటక దర్శకులు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ప్రోత్సాహంతో విజయవాడ ఉత్సవ్‌లో కళారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. అదేవిధంగా తెనాలిలోని కళల కాణాచి నాటక రంగ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో మంగళవారం టీజీవీ కళాక్షేత్రం కళాకారులు సామా నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకం అసాంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. నిర్వాహక సంస్థ అధ్యక్షుడు, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, నటి జయలక్ష్మి నాటక ప్రదర్శన అనంతరం దర్శకుడు పత్తి ఓబులయ్యతో, కళాకారులను ఘనంగా సత్కరించి జ్ఞాపిక, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.



సామా నాటకంలోని ఓ సన్నివేశం

# కర్నూలు మీదుగా బుల్లెట్ ట్రైన్..!

**• రైల్వే కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ లిమిటెడ్ సర్వే**




కర్నూలు సిటీ రైల్వే స్టేషన్

**కర్నూలు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు మీదుగా బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు హైస్పీడ్ బుల్లెట్ రైలు వాయువేగంతో పరుగులు పెట్టనుంది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 626 కిలోమీటర్లు పొడవు హైస్పీడ్ రైల్వే కారిడార్ నిర్మాణం కోసం రైల్వే కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ లిమిటెడ్ సర్వే నిర్వహిస్తోంది. డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ - చెన్నై, హైదరాబాద్ - బెంగళూరు వయా మహబూబ్‌నగర్, కర్నూలు, డోన్ కారిడార్ల నిర్మాణానికి కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఆమోదం తెలిపింది. హైస్పీడ్ బుల్లెట్ రైళ్లు దూసుకుపోవడానికి వీలుగా హైస్పీడ్ ఎలివేటెడ్ ట్రైన్ కారిడార్ నిర్మాణం చేపట్టనున్నారు. హైదరాబాద్ - బెంగళూరు కారిడార్ ఎలైన్‌మెంట్‌కు ప్రాథమిక ఆమోదం లభించిందని రైల్వే అధికారులు అంటున్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారీలో నిమగ్నమయ్యారు. 621.8 కిలోమీటర్లు, 576.6 కిలో మీటర్లు, 558.2 కిలో మీటర్లు పొడవుతో నిర్మించేలా మూడు ఎలైన్‌మెంట్లు పరిశీలిస్తున్నారు. ఈ కారిడార్‌లో భాగంగా ఏపీలో కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, దుద్దేబండ, హిందుపురం రైల్వే స్టేషన్లు నిర్మించేలా ప్రతిపాదించారు. ఏపీలో 263.3 కిలోమీటర్లు, తెలంగాణలో 218.5 కిలో మీటర్లు, కర్ణాటకలో 94.80 కిలోమీటర్లు హైస్పీడ్ రైలు మార్గం నిర్మిస్తారు. డబుల్ లైన్, లూప్‌లైన్స్, సైడింగ్‌లు కలిపి మొత్తం 1,363 కిలోమీటర్లు రైలు మార్గం నిర్మాణానికి సర్వే జరుగుతుంది. ఈ సర్వేను రైల్వే కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ లిమిటెడ్ సర్వే నిర్వహిస్తోంది. ఈ మార్గం పూర్తయితే హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ట్రైన్ వేగాన్ని బట్టి కేవలం 2 గంటల్లో చేరుకోవచ్చు. ఈ ప్రాజెక్టులో భాగంగా తుంగభద్ర, హంద్రీ నదులపై నూతన రైల్వే వంతెనలు నిర్మించాల్సి ఉంది. తుంగభద్ర నదిలో వంతెనల నిర్మాణం కోసం జియోటెక్నికల్ ఇన్వేస్టిగేషన్ కోసం బోర్ హోల్స్ వేయాల్సి ఉంది. అందుకు అనుమతి కోరుతూ రైట్స్ లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజరు సౌరబ్ మంగళవారం జలవనరుల శాఖ ఎస్ఈ బాలచంద్రారెడ్డికి లేఖ రాశారు.

## హంద్రీకి కొనసాగుతున్న నీటి విడుదల



గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి విడుదల అవుతున్న నీరు

**గోనెగండ్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):** గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి మంగళవారం మధ్యాహ్నం జీడీపీ ఇరిగేషన్ అధికారులు హంద్రీనదికి జీడీపీ 4వ గేటు ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు 4వ గేటు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని హంద్రీ నదికి విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. ఆదివారం సాయంత్రం ప్రాజెక్టుకు వరదనీరు చేరడం నిలిచిపోవడంతో ప్రాజెక్టు గేటు మూసివేశారు. అయితే సోమవారం సాయంత్రం నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ తదితర ప్రాంతాలలో ఒక మోస్తరు వర్షం కురియడంతో మంగళవారం మధ్యాహ్నం వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం గాజులదిన్నెప్రాజెక్టులో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రానికి నీటి మట్టం(4 టీఎంసీ) 376.70 మీటర్లు ఉంది. జీడీపీ పూర్తిస్థాయి నీటి మట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 0.30 మీటర్ల మాత్రమే తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో నీరు సామర్థ్యానికి తగ్గట్టుగా పూర్తిగా ఉందని, ఇప్పటి నుంచి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటిని ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

## అహోబిలంలో తమిళనాడు హైకోర్టు జడ్జి

**ఆళ్లగడ్డ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో మంగళవారం తమిళనాడు హైకోర్టు జడ్జి జస్టిస్ ఆశ లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, సీతవో సౌందర్యరాజన్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరద స్వామి వారికి అష్టోత్తర పూజ, అమృతవల్లి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. వేదపండితులు ఆమెకు ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ ఆశ

## వీడని వాన

**• పెద్దకడుబూరులో అత్యధికంగా 53.4 మి.మీ.**
**• మద్దికెరలో అత్యల్పంగా 1 మి.మీ. వర్షపాతం**

**కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** సెప్టెంబరు నెలతో నైరుతి రుతుపవనాల సీజన్ పూర్తయింది. వాన మాత్రం వీడలేదు. మంగళవారం చివరిరోజు కూడా వరుణుడు తన ప్రతాపాన్ని చూపించాడు. చేతికంది వచ్చిన పంటలు నీటిలో మునిగడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. పెద్దకడుబూరులో అత్యధికంగా 53.4మి.మీ నమోదు కాగా, మద్దికెరలో 1 మి.మీ వర్షపాతం నమోదైంది. 26 మండలాలకు గాను 24 మండలాల్లో వర్షం కురిసింది. సెప్టెంబరు నెలాఖరు వరకు సాధారణ వర్షం 116.5 మి.మీ కురవాల్సి ఉండగా 225.8 మి.మీ వర్షపాతం నమోదైందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.

## రేపు మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు

**కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):** అక్టోబరు 2 గాంధీ జయంతి రోజు మాంసాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక ప్రజారోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి పి.విశ్వనాథ్ మంగళవారం ప్రకటనలో హెచ్చరించారు. కమేళాలు, మాంసం దుకాణాలు మూసివేయాని, అతిక్రమిస్తే భారీ జరిమానాతో పాటు లైసెన్సు రద్దు చేస్తామన్నారు.



## రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

**కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** చిన్నటేకూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై కారు ప్రమాదంలో మృతిచెందిన గొర్రెల కాపరి ఎల్లరాముడు కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని కురువ సంఘం వర్కింగ్ ప్రెసిడెంటు గుడిసె శివన్న ప్రకటనలో డిమాండ్ చేశారు. కారు గొర్రెల మందపైకి దూసుకెళ్లడంతో 33 గొర్రెలతో సహా గొర్రెల కాపరి కూడా మృతి చెందాడదని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# జయహే మహిషాసుర మర్దిని

● కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు





లలితాపీఠంలో కలశాలతో మహిళా భక్తులు



**కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని మించిన్‌బజార్ అమ్మవారిశాలలో మంగళవారం వాసవి మాత దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం పురోభివృద్ధి సాధించాలని కోరుతూ టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పి. హనుమంతరావు చౌదరి దంపతులు మార్కెట్ యార్డు సమీపంలోని దుర్గామాత మంటపం వద్ద పూజలు చేశారు. వీహెచ్‌పీ మాతృశక్తి విభాగం ఆధ్వర్యంలో హరిశ్చంద్రనగర్‌లోని సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో దుర్గాష్టమి పూజలు చేశారు. చిత్తారి వీధిలోని నిమిషాంబ ఆలయంలో అమ్మవారికి సరస్వతి దేవి అలంకరణ చేశారు. పాతనగరంలోని గీతామందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారికి దుర్గాదేవి అలంకరణ చేశారు. నగరంలోని నెహ్రూనగర్‌లోగల శ్రీ సత్యసాయి మందిరంలో అమ్మవారికి దుర్గాదేవి అలంకరణ చూసి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే నగరంలోని అన్ని ఆలయల్లో పూజలు నిర్వహించారు.

## పేదల సంక్షేమమే సీఎం ధ్యేయం



స్మార్ట్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

**కర్నూలు రూరల్ సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):** పేదల సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. పసుపుల గ్రామంలో మంగళవారం స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా నిర్వహిస్తోందన్నారు. వృద్ధులు, దివ్యాంగుల ఇంటి వద్దకే సరుకులు అందజేస్తున్నా మన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజా పంపిణీ అస్తవ్యస్తంగా తయారు చేసిందని ఆరోపించారు. రూరల్ తహసీల్దార్ టి.వెంకటరమేష్‌బాబు మాట్లాడుతూ మండలానికి 26,130 స్మార్ట్ రేషన్‌కార్డులు రాగా, 13వేల కార్డులను పంపిణీ చేశామన్నారు. కార్యదర్శి హేమంత్‌కుమార్‌రెడ్డి, వీఆర్వో మద్దిలేటి, రేషన్‌డీలర్లు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● నగర పాలకసంస్థ పరిధిలో 38వ వార్డు మామిదాలపాడు గ్రామంలో పత్తికొండ టీడీపీ పరిశీలకుడు వై రామేశ్వరరెడ్డి లబ్దిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేశారు.

## అన్న క్యాంటీన్లను పర్యవేక్షించాలి : కమిషనర్



క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథ్

**కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** నగరంలో ఉన్న 5 అన్న క్యాంటీన్లను కో ఆర్డినేటర్లు పర్యవేక్షించాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. మంగళవారం పరిమళ నగర్, ప్రభుత్వ ఆసుపత్రి, సెట్కూరు కార్యాలయ సమీపంలోని క్యాంటీన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజూ మూడు పూటలా తనిఖీ చేయాలని, ప్రజలకు అందించే భోజనం నాణ్యతో రాజీ పడవద్దన్నారు. సెంట్రల్ ప్లాజా వద్ద పెయింటింగ్ పనులను పరిశీలించి అక్కడ వర్క్ ఇన్‌స్పెక్టర్ అందుబాటులో లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.





## ప్రమాద స్థలాన్ని పరిశీలించిన గౌరు



ఘటనా స్థలంలో గౌరు వెంకటరెడ్డి

**కల్లూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):** మండలంలోని బస్తిపాడు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఎల్లరాముడు(34)తో సహా 25 గొర్రెలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాయి. విషయం టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి మంగళవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా గొర్రెల పెంపకం దారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కన్వీనర్ డి.రామాంజనేయులు, కల్లూరు సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులంకాటి శేఖర్, కుర్వ ధనుం జయ తదితరులు ఉన్నారు.

## వీరశైవులు ఐక్యత చాటాలి



చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న మహిళలు

**కోడుమూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలోని వీరశైవులు ఐక్యత చాటాలని వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ తుల్జాపూర్ స్వప్న సూచించారు. మంగళవారం మల్లేశ్వరస్వామి ఆలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో బిసి-డి రిజర్వేషన్ లేక యువతకు ఉద్యోగాలు రావడం లేదన్నారు. అనంతరం చైర్‌పర్సన్‌ను సన్మా నించారు. సిద్దేశ్వరమ్మ, లక్ష్మీదేవి, పద్మావతి, మాధవి, శివశంకర్ పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కారం



బోరు వేయిస్తున్న కౌన్సిలర్ రత్నమ్మ

**గూడూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** స్థానిక 7వ వార్డు సింగనగేరిలో నూతన బోరు వేయడంతో నీటి సమస్య పరిష్కారమైందని కౌన్సిలర్ మండ్ల రత్నమ్మ, టీడీపీ నాయకుడు పరశురాముడు మంగళవారం అన్నారు. సమస్యను కేడీసీసీబీ చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళగా బోరు వేయాలని అధికారులకు సూచించారన్నారు. రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, బాబు, కృష్ణ, కర్ణ, పాల్గొన్నారు.

## గోరంట్లలో కూలిన మట్టిమిద్దె

**కోడుమూరు రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):** మండలంలోని గోరంట్లలో వర్షాల ప్రభావానికి మట్టిమిద్దె కూలింది. వివరాల మేరకు.. చాకలి నాగశేషు భార్య, కొడుకుతో సోమవారం రాత్రి భోజనం చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి తర్వాత శబ్దం వస్తుండటంతో బయటకు పరుగులు తీశారు. అనంతరం మిద్దె కూలింది.

## బాధితులకు అండగా సీఎం సహాయ నిధి



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

**కల్లూరు/ఓర్వకల్లు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ఆసుపత్రుల్లో చికిత్స చేయిం చుకున్న బాధితులకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో కొమరోలు, వెంకటాపురం, చెన్నంచెట్టిపల్లె, కాల్వ, పూడిచర్ల గ్రామాలకు చెందిన బాధితులకు రూ.34,88,779ల చెక్కులు పంపిణీ చేశారు. పుల్లారెడ్డి, ప్రకాషం, శివుడు, తిరుపాలు పాల్గొన్నారు.

● నగరంలోని శరీన్ నగర్, కిసాన్ నగర్ పార్కులో అమ్మవారిని దర్శిం చుకుని, అన్నదానంలో పాల్గొన్నారు. పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, ఎస్‌కె. శ్రీనివాసరావు, శైలజాయాదవ్, నాగమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**కోడుమూరు రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):** వర్కూరు సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ స్వామి తెలిపిన మేరకు.. మంగళవారం ఉదయం ఎమ్మిగనూరు రోడ్డులోని బంగారు వీరన్న పొలంగట్టు వద్ద నీటికాలువలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ స్వామి సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి విచారణ చేపట్టారు. మృతుడి శరీరంపై నలుపు, ఎరుపు టీషర్ట్, బూడిద కలర్ జీన్స్ ప్యాంట్, మెడలో నల్లటిదారం ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని కోరారు. వీఆర్వో శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు

**ఓర్వకల్లు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** నడివాగు వంతెన నిర్మాణానికి రూ.18 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు టీడీపీ నాయకుడు, కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్ర పెద్దస్వామి అన్నారు. మంగళవారం హుశేనాపురం గ్రామంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ రూ.18లక్షలతో కలెక్టర్‌కు ప్రతిపాదన పంపామన్నారు. వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తగదన్నారు. రామగోవిందు, ఖాదర్‌బాషా, షంషుద్దీన్, గువ్వ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సత్యనారాయణ రెడ్డి



**కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా సీనియర్ ప్రొఫెసర్ డా.ఎం.సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. డా.పృథ్వి వెంకటేశ్వర్లు పదవీ విరమణ పొందనుండటంతో ఆయనను నియమిస్తూ కేఎంసీ ప్రిన్సిపాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

## పత్తి రైతులను ఆదుకోవాలి



పత్తిపంటను పరిశీలిస్తున్న నాయకులు

**కల్లూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** వర్షాలతో పంట నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం బొల్లవరం గ్రామంలో పత్తిరైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఎకరాకు రూ.50 వేల పెట్టుబడి పెట్టారని, ప్రభుత్వం ఎకరాకు రూ.30 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. మండల కార్యదర్శి ఏ.కృష్ణ, శేఖర్, లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.





## బస్తిపాడులో నిలిచిన విద్యుత్ సరఫరా

**కల్లూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని బస్తిపాడుగాలో 15 గంటలుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం రాత్రి 7 గంటలకు సరఫరాలో అంతరాయం కలుగగా మంగళవారం ఉదయం 10 గంటల వరకు పునరుద్ధరించలేదు విద్యుత్ అధికారులు, సిబ్బందికి సమస్య తెలిపినా స్పందించడం లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్లూరు విద్యుత్ ఏఈని వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ కావడంతో కేబుల్ కాలిపోయిందని, అవసరమైన మెటీరియల్ లేక మరమ్మతులు చేయలేదన్నారు.

## రథాన్ని ప్రారంభించిన మాజీ ఎంపీ టీజీ



వెండి రథానికి పూజలు చేస్తున్న మాజీ ఎంపీ

**కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని పూలబజార్ చిన్న అమ్మవారిశాలలో భక్తుల సహకారంతో రూపొందించిన వెండి రథాన్ని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం టీజీ వెంకటేశ్ పూజలు చేశారు. వాయుగండ్ల సుబ్బారావు, చిలుకూరు నందకిషోర్, మారం శ్రీనివాసులు, కొండ నాగరాజు, ద్వారకానాథ్, సాయిబాబా, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఎన్‌ఆర్ పేటలో టీజీబీ ఏర్పాటు చేసిన విగ్రహానికి టీజీ వెంకటేశ్ పూజలు నిర్వహించారు. నరసింహ, లక్ష్మన్న, మోహన్ రావు, ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ టీజీ వెంకటేశ్, మంత్రి టీజీ భరత్ సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు.

## మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ



బెల్టులు ప్రదానం చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

**కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ వస్తుందని గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డా.శంకర్‌శర్మ అన్నారు. నగరంలోని కిడ్స్ పార్కులో టీజీవీ, టీజీబీ తైక్వాండో అకాడమి ఆధ్వర్యంలో క్రీడాకారులకు బెల్టులను అందజేశారు. ఊబకాయంతో అనారోగ్య సమస్యలు వస్తాయని తప్పక వ్యాయామం చేయాలన్నారు. కోచ్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

# ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

## ఆలూరుకు టీడీపీ నాయకులు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు

**దేవనకొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** నూతన ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతిని కలిసేందుకు మండల టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న, కప్పట్రాళ్ల మల్లికార్జున, బాస్కర్, వీరేష్, వెంకటస్వామి గౌడ్ దాదాపు 40 వాహనాలలో తరలివెళ్లారు. ముందుగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

## 2,700 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలు మంజూరు

**మద్దికెర సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** మండలంలో రబీలో రైతులు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం రాయితీ కింద మండలానికి 2,700 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేసిందని వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాలు రాయితీ పోనూ రూ.5,850 ప్రకారం ధర నిర్ణయించడం జరిగిందన్నారు. ఒక్కొక్క పాసు పుస్తకానికి రెండు క్వింటాళ్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విత్తనాలు ఆసక్తిగల రైతులు సంబంధిత ఆర్‌బీకే కేంద్రాల్లో ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ చేసుకున్న రైతులకు విత్తనాలు వచ్చిన వెంటనే సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఆయా ఆర్‌బీకే కేంద్రాల్లో విత్తన సరఫరా ఉంటుందన్నారు.

# దుర్గాదేవిగా అమ్మవారు



ఆదోనిలో సిద్ధిధాత్రి దేవి అలంకరణలో ..



ఆలూరులో శివదూతి దేవి అలంకరణలో ..



తుగ్గలిలో దుర్గాదేవిగా సుంకులా పరమేశ్వరి



మద్దికెరలో దుర్గాదేవి అలంకరణలో ..



పత్తికొండలో..

ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో తొమ్మిదో రోజు మంగళవారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలను నిర్వహించి మహా మంగళహారతి నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

## జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన

**తుగ్గలి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** జీఎస్టీ తగ్గించడం వల్ల ప్రజలకు కొంత భారం తగ్గుతుందని టీడీపీ సీనియర్ నాయకులు పాటిల్ ఈశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పగిడిరాయిలో కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై కూటమి ప్రభుత్వం పిలుపు మేరకు గ్రామంలో పర్యటించి ఇంటింటికి తిరిగి జీఎస్టీ తగ్గింపుపై చేకూరే లాభాల గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంచాయతీ కార్యదర్శి రాజు నాయక్, డీలర్ సుంకన్న, రాము, నాగార్జున, ఉన్నారు.

## ఆలూరులో ఇకపై చంద్రబాబు వర్గమే

**టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి**



టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, శివప్రసాద్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

**ఆలూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇక చంద్రబాబు వర్గమే అని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, శివప్రసాద్ అన్నారు. మంగళవారం ఆస్పరి, దేవనకొండ మండలాల నాయకులు నూతనంగా నియామకమైన టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలో ఇన్నాళ్లు వర్గాలతో క్యాడర్ నష్టపోయిందన్నారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు వర్గాలకు తావు లేకుండా క్యాడర్‌ను ఒకే తాటిపైకి తీసుకొస్తామన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో ప్రజల వద్దకు మీ ఇన్‌చార్జి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జున, బండి గింజల రంగన్న, వీరేష్, భాస్కర్, మలకన్న, వెంకటస్వామిగౌడ్, కృష్ణయాదవ్, జీవన్‌కుమార్, అట్టేకల్ శివకుమార్, పెద్ద సంజప్ప, శేషాద్రినాయుడు, సతీష్, మేకల రంగనాథ్, యుగంధర్, రవి, మారేష్, రాజు పాల్గొన్నారు.

## గిట్టుబాట ధర కల్పించాలి

**ఆస్పరి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య కోరారు. మంగళవారం ఆయన దెబ్బతిన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా రైతులు ఉల్లి, టమోటా, పత్తి, మిర్చి, కంది, వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం, కొర్ర, సజ్జ తదితర పంటలు సాగు చేశారన్నారు. అధిక వర్షాల వల్ల రైతులు వేసిన పంటలు చేతికి వచ్చే సమయంలో భారీ వర్షాల వల్ల పంట మొత్తంలో నీటిలో మునిగి చాలావరకు నష్టం జరిగిందన్నారు. పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. నష్టపోయిన ప్రతిఒక్క రైతుకు కరాకు రూ.50 వేలు చొపన పంట నష్టపరిహారం అందించాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, బడేసాబ్, రంగన్న, హనుమంతు పాల్గొన్నారు.

## అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే పూజలు



అమ్మవారి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్

**ఆదోని టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :** దుర్గాష్టమిను పురస్కరించుకొని బైచిగిరి లోని అంబాభవాని దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ దుర్గా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలను నిర్వహించి మహా మంగళహారతి నిర్వహించారు. ప్రతి ఏడాది లాగే ప్రకాష్ జైన్, బైచిగేరి ప్రజలందరికీ దుర్గామాతకు సంబంధించిన అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మ్లేకర్ శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

## సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపిక

**ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :** పట్టణంలోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల విద్యార్థి అఖిల్ అక్టోబర్ 4 నుంచి కర్ణాటక రాష్ట్ర బెలగావిలో జరిగే సౌత్ జోన్ కబడ్డీ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం ఎంపికైన అఖిల్ ను కరస్పాండెంట్ మురళి బాబు అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సురేంద్ర బాబు, రూప, ప్రిన్సిపాల్ డాక్టర్ స్వామినాథ్ పాల్గొన్నారు.

## బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి

**హాలహర్వి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని బిలేహాల్, విరుపాపురం, బలగోట గ్రామాల్లో బన్ని ఉత్సవాల్లో కర్రల సమరానికి స్వస్తి పలికి ప్రశాంతంగా పండగ జరుపుకోవాలని ఎస్ఐ మారుతి అన్నారు. మంగళవారం ఆయన ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. భక్తిశ్రద్ధలతో పండగ జరుపుకుని, ఎటువంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందువల్ల ఎవరు కూడా కర్రలతో దేవరగట్టుకు వెళ్లొద్దని ఆయన పేర్కొన్నారు.

## రోడ్లు బాగు చేయరా..?



రోడ్లపై మొక్కలు నాటుతున్న సీపీఎం నాయకులు

**పత్తికొండ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** డివిజన్ కేంద్రమైన పత్తికొండ పట్టణంలో గుంతలు పడిన రోడ్లపై ప్రజలు ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరా అంటూ సీపీఎం పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి రవిచంద్రలు ప్రశ్నించారు. మంగళవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గుంతలు పడిన రోడ్లపై మొక్కలు నాటి వినూత్న నిరసన తెలియజేశారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్, చక్రాళ్ల సుంకం గేటుతో పాటు ప్రధాన రహదారుల్లో భారీగా గుంతలు పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్న నాయకులు

**చిప్పగిరి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీ జెడ్పీటీసీ ఏర్రూరు మీనాక్షినాయుడు అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. చిప్పగిరి మండలంలోని ఆయా గ్రామాల్లో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిప్పగిరి మండలంలో 24 రేషన్ షాపులు ఉండగా 8727 స్మార్ట్ రేషన్‌కార్డులు మంజూరయ్యాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయడమేగాకుండా ఇతర పథకాలను కూడా అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవియాదవ్, మిరపకాయల చంద్ర, వెంకటేష్, రామచంద్ర, మాజీ ఎంపీటీసీ నరసింహులు, కొండ రామాంజినేయులు, తిమ్మప్ప, విశ్వనాథ్ పాల్గొన్నారు.

**ఆదోని టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :** పట్టణంలోని 19వ వార్డు మండిగిరి ప్రాంతంలోని రేషన్ కార్డు దారులకు మంగళవారం మండిగిరి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస ఆచారి ఆధ్వర్యంలో పాత రేషన్ కార్డు స్థానంలో కొత్త స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటికి కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కూటమి పాలనలో రేషన్ షాపుల ద్వారా అనేక వస్తువులను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. జనసేన నాయకుడు మంజు పాల్గొన్నారు.

## హోసూరు పొలాల్లో చిరుత సంచారం

**పత్తికొండ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** పత్తికొండ మండల పరిధిలోని హోసూరు గ్రామ పొలాల్లో మంగళవారం సాయంత్రం చిరుత సంచరించడంతో పొలాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వివరాల మేరకు... హోసూరు, మొలగవల్లి కొట్టాల రహదారిలో ఉన్న ఓ వంక వద్ద సాయంత్రం 6 గంటల సమయంలో చిరుత సంచరిస్తున్న దృశ్యాలను గ్రామస్తులు సెల్‌ఫోన్‌లలో బంధించారు. వంకలు ఈ గ్రామ పొలాల్లో అధికంగా ఉండడంతో నెమళ్లు, జింకలు ఎక్కువగా సంచరిస్తుండడంతో చిరుత కూడా అదే ప్రాంతాన్ని ఎంచుకుని, వేట సాగించేందుకు వచ్చి ఉండొచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా గ్రామ పొలాల్లో చిరుత సంచరించడంతో ఆ పొలాల రైతులు దీన్ని చూసి భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత ఫారెస్టు అధికారులు స్పందించి చిరుతని బంధించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

**పత్తికొండ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** పత్తికొండ పట్టణంలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.50 లక్షలు ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతినాయుడు డిమాండ్ చేశారు.

- **మృతుల కుటుంబాలను ఆదుకోవాలి**

పత్తికొండ పట్టణంలో లారీ ప్రమాదంలో మృత్యువాత పడిన బాధితా కుటుంబాలను ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.20 లక్షలు పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి రవిచంద్ర డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కాశీం, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

- **ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలి**

పత్తికొండ పట్టణంలో లారీ ప్రమాదంలో మృతిచెందిన మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ రామకొండ వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు బురుజుల పులికొండలు కోరారు.

## ప్రభుత్వంపై ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు

**మద్దికెర సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు మానుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ, తాలుకా తెలుగు యువత అధ్యక్షులు ఈడిగ చంద్రశేఖర్ గౌడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, చంద్రమోహన్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజలు 11 సీట్లు ఇచ్చినా బుద్ధి రాలేదన్నారు. డిజిటల్ బుక్ అంటూ విడుదల చేశారనీ, డిజిటల్ బుక్ కాదయ్యా.. అభివృద్ధి చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఇళ్ల స్థలాలు అమ్ముకున్నారనీ, దౌర్జన్యాలు చేశారనీ ఆరోపించారు. కూటమి మహిళా నాయకులపై సోషల్ మీడియా ద్వారా కించపరచలేదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నేతృత్వంలో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పథకాలైన సూపర్ సిక్స్ అన్నీ అమలు చేశారనీ, రైతులకు హెక్టారుకు ఉల్లి పంటకు రూ.50వేలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆటో డ్రైవర్లకు రూ.15వేలు ఇస్తున్నారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో మీసేవ భీమ్‌రాజు, గొడుగు సతీష్ కుమార్, గుడి ఎల్లప్ప, విఠోభ, రవి పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించండి



అమీనాబాదు రోడ్డులో మొక్కలు నాటుతున్న కూలీలు

**తుగ్గలి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):** రోడ్డుకిరువైపులా మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఈసీ రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని అమీనాబాదు, గిరిగిట్ల తదితర గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్ కింద రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటి వాటికి పశువులు మేతకు గురి కాకుండా కంచె ఏర్పాటు చేయాలన్నారు. ఆ మొక్కలు పెద్దగా అయ్యే వరకు వాటికి నీరు పోస్తూ సంరక్షిస్తే ప్రభుత్వమే వేతనాలు అందిస్తుందన్నారు. మొక్కలు పెంచడం వల్ల బాటసారులకు ఈ కార్యక్రమంలో టీఏ రామకృష్ణ, ఎఫ్ఏ సతీష్ కుమార్, టీడీపీ నాయకులు దేవేంద్ర, బలరాముడు, తదితరులు ఉన్నారు.

## ఘనంగా మంచాలమ్మ ఊరేగింపు


మంచాలమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

మంత్రాలయం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ తెప్పోత్సవంపై దర్శనమిచ్చారు. మంగళవారం నవరాత్రోత్సవాల్లో తొమ్మిదో రోజు దుర్గాష్టమి శుభదినం సందర్భంగా మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు చేతుల మీదుగా పండితులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. అలాగే తెప్పోత్సవం నిర్వహించారు.

## దుర్గామాతగా అమ్మవారు


గోనెగండ్లలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

గోనెగండ్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు పలు గ్రామాల్లో దేవీ నవరాత్రుల్లో భాగంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. వీవర్స్ కాలనీలోని కాశీవిశ్వేర స్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈశ్వరదేవాలయంలో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

# రైతులకు సాయం అందిస్తా

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి


గంజహళ్లిలో వర్షానికి తడిసిన పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పత్తి, వరి, వేరుశనగ రైతులు తీవ్రంగా నష్టపోయారని ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం మండల పరిధిలోని గంజహళ్లి గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అలాగే సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని వీధులలో పర్యటించి సీసీరోడ్లు, మురుగు కాలువల సమస్యలను తెలుసుకున్నారు. అలాగే ఊరి చెరువుకు నీటిసమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరడంతో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామ శివార్లలో వర్షానికి తడిసిన పత్తి పంటను రైతులు ఆరబోసుకుంటుండగా ఎమ్మెల్యే వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. అందుకు రైతులు ప్రభుత్వ సాయం అందించి ఆదుకోవాలని కోరడంతో సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. అలాగే గంజహళ్లి బడా సాహెబ్ స్వామి సమాధిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఏవో హైమలత, మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, నజీర్ సాహెబ్, కున్నూరు రమణ, రహంతుల్లా, రాపురం రఫీక్, కాంట్రాకర్ట్ షేక్షావలి, పక్రుద్దీన్ పాల్గొన్నారు.

నందవరం: ప్రజలకు సులభతరం చేసేందుకే కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తోందని టీడీపీ మండల కన్వీనర్ కాశీంవలి అన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మాచాపురంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కార్డుల ఉపయోగం గురించి ప్రజలకు వివరించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడు తున్న కిరణ్ ఇంటికి వెళ్లి ఆయనతో మాట్లాడారు.

## 'బూతు మాటలకు పేటెంట్ రైట్స్ వైసీపీ'

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): బూతు మాటలకు పేటెంట్ రైట్స్ ఉన్న పార్టీ వైసీపీ అని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందుపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఓ మాట మాట్లాడారని ఆ మాట మా నాయకుడు జగన్ గురించి మాట్లాడారని వైసీపీ నాయకులు అంటున్నారన్నారు. బాలకృష్ణ ఎవరిని ఉద్దేశించి అనలేదని వైసీపీ వారు అలా అనుకుంటే అది మీ ఇష్టం అన్నారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటి చైర్మన్ మల్లయ్య, నాయకులు మాచాని మహేష్, ముల్లా కలీముల్లా, రామకృష్ణ నాయుడు, మద్దిలేటి, దేవదాసు, రాజేష్, కేటీ వెంకటేశ్, బచ్చుల రంగన్న, ఉరుకుందులు పాల్గొన్నారు.

## మత్స్యకార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

గోనెగండ్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు మత్స్యకార్మిక సంఘం కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు రంగస్వామి నాయుడు, ప్రధాన కార్యదర్శి మునిస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం గాజులదిన్నె ప్రాజెక్టులో మత్స్యకార్మిక సంఘం సభ్యులు జీడీపీ అధికారులకు వ్యతిరేకంగా నినాధాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు రంగస్వామి మాట్లాడుతూ గత 18 రోజులుగా జీడీపీ ఇరిగేష న్ అధికారులు గాజులదిన్నె ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో ప్రాజెక్టులో ఉన్న చేపలు అన్ని నీటితో పాటు దిగువకు పోతున్నాయని, రెండేళ్లుగా చేపలు పట్టలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తీవ్రం గా నష్టం వచ్చిందని వారు తెలిపారు. ప్రభుత్వానికి గాజుల దిన్నె మత్స్య సంఘం నుంచి ప్రతి ఏడాది రూ. 12లక్షలు రుసుము చెల్లిస్తున్నామ న్నారు. రూ.20 లక్షలు ఖర్చుచేసి 40 లక్షల చేప గుడ్లను ప్రాజెక్టులో పెంచామని, అవి చేతికి అందేలోపు నీటి విడుదల చేయడంతో చేపలన్నీ దిగువకు పోతున్నాయన్నారు

## రోడ్డుపై అక్రమ కట్టడాలు నిలిపి వేయాలి


ధర్నా చేస్తున్న రామక్కమ్మవ్వ కాలనీవాసులు

కోసిగి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల కేంద్రంలోని 9వ వార్డు రామక్కమ్మవ్వ కాలనీకి చెందిన సీసీ రోడ్డుపై అక్రమ కట్టడాలు ఆపాలని కోరుతూ ఆ కాలనీకి చెందిన సుమారు 200 మంది మంగళవారం ప్రధాన రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రామక్కమ్మవ్వ కాలనీకి చెందిన పెద్దలు బండి నాగరాజు, రామయ్య, కేబీ నాగరాజు, మారెప్ప, సంజీవయ్య, తిక్కయ్య మాట్లాడుతూ ఓ మాజీ ప్రజాప్రతినిధి పెండ్యాల ఆది నారాయణశెట్టి సీసీ రోడ్డుపై నిర్మాణం చేపట్టారన్నారు. దీంతో కాలనీకి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందన్నారు. ఇప్పుడు రోడ్డు మధ్యలో మార్కు వేసి ఈ రోడ్డు కూడా తనదేనంటూ తెలపడం సమంజసం కాదన్నారు. సీఐ మంజునాథ్ ఆదేశాలతో ఏఎస్ఐ తిరుపాల్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున స్వామి, కానిస్టేబుల్ శ్రీనివాసులు కాలనీవాసులకు సర్దిచెప్పి అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పడంతో వారు శాంతించారు.

## 'అభివృద్ధి చేసింది మేమే'

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలం మల్కాపురం గ్రామంలో అభివృద్ధి చేసింది మేమేనని ఎంపీపీ కేశన్నయాదవ్, వైసీపీ సర్పంచ్‌లు దేవేంద్రగౌడ్, కొటేకల్లు లక్ష్మన్న అన్నారు. మంగళవారం ఎం పీడీవో కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మా ట్లాడారు. సోమవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మల్కాపురం గ్రామంలో పర్యటించిన సందర్భంలో వైసీపీ సర్పంచ్ దేవేంద్రగౌడ్‌ను అవమానించారన్నారు. గ్రామంలో అసలు అభివృద్ధి చేయలేదనడం సరికాదన్నారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రం, సచివాలయాలను ఏర్పాటు చేయ డంతో పాటు పేదలకు సంక్షేమ పథకాలను అందించామ న్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు కడివెళ్ల రంగస్వామి, వెంకటరామిరెడ్డి, మల్లికార్జున, లోకన్న, పెద్దయ్య, అబ్రహం, భాస్కర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

## మాల బేగరుల సమస్యలు అసెంబ్లీలో చర్చించడం హర్షణీయం


క్షీరాభిషేకం చేస్తున్న రంగయ్య

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో మాల బేగరుల సమస్యల చర్చించడం హర్షణీయమని ఆ సంఘం నాయకుడు మాల రంగయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక సోమప్ప సర్కిల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం సోమప్ప సర్కిల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. పట్టణ టీడీపీ కోశాధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాఘవేంద్రుడి సేవలో హిందూపురం ఎంపీ

మంత్రాలయం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎంపీ పార్థసారథి మంగళవారం మంత్రాలయంలోని రాఘవేంద్రస్వామి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఆయనకు స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

## చేనేత పార్కును నిర్మించాలి : సీపీఎం

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని బనవాసి వద్ద నిర్మిస్తున్న టెక్స్‌టైల్ పార్కు స్థానంలో చేనేత పార్కును నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌస్ దేశాయ్, పట్టణ కార్యదర్శి గోవిందు మాట్లాడుతూ ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కు నిర్మా ణానికి పథకాలు సిద్ధం చేస్తున్నట్లు పత్రికలలో సమాచారం వస్తోందన్నారు. టెక్స్‌టైల్ పార్కులో పవర్ మగ్గాల ద్వారా తక్కువ మందికి ఉపాధి లభిస్తుందని, కావున చేనేత పార్కు నిర్మిస్తే రేషన్ మగ్గాల ద్వారా ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాముడు, హనుమంతు, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ అధికారులకు జింక పిల్ల అప్పగింత


జింక పిల్లను అటవీ అధికారులకు అందజేస్తున్న రైతులు

పెద్దకడబూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కల్లుకుంట గ్రామ పొలాల్లో రైతులు జింకపిల్లను అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. మంగళవారం జింకపిల్ల పంట పొలాల్లో దొరకడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. పోలీసులు అటవీ అధికారులకు తెలపడంతో వారు స్పందించారు.



## ఘనంగా జన్మదిన వేడుకలు


సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

పెద్దకడబూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెద్దకడ బూరు మండల కేంద్రంలో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రమాకాంతరెడ్డి స్వగృహం లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలి పారు. సొసైటీ చైర్మన్ మీసేవ ఆంజనేయులు, సత్యన్నగౌడ్, మల్లికార్జున, వీరేష్‌గౌడ్, బొగ్గుల తిక్కన్న, బొగ్గుల బాషా పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఈ

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల విద్యుత్ ఎస్ఈగా బాధ్యతలు తీసుకున్న ఎస్ఈ ఆర్.ప్రదీప్ కుమార్ మంగళవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డిని ఆయన స్వగృహంలో కలిశా రు. ఎస్ఈ వెంట ఏడీఈ డీవీ నాగేంద్రప్రసాద్, డీఈ విజయ్ రాజు, ఏఈ ఉన్నారు.

## ఇళ్లలోకి వర్షపు నీరు


ఇంట్లోని నీటిని ఎత్తిపోస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. దీంతో కాలనీలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాత్రంగా నిద్రలేక అవస్థలు పడ్డారు. ఇళ్లలోని వర్షపునీటిని రాత్రంగా బయటకు తోడేస్తూ ఇబ్బందిపడార న్నారు.

## చేనేతలకు సాయం అందిస్తాం

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు నష్టపోయిన చేనేత కుటుంబాలకు సాయం అందిస్తామని బీజేపీ నేతలు దయాసాగర్, నారాయణ అన్నారు. మంగళవారం స్థానిక శివన్న నగర్, శాంతి నగర్‌లోని చేనేత కార్మికులతో మాట్లాడారు. అధికారులతో మాట్లాడి ప్రభుత్వం తరపున విపత్తు నిధుల కింద సాయం అందేలా చూస్తామన్నారు.

## ఒకే రోజు రెండు పార్టీల కండువాలు

● కామన్‌దొడ్డిలో వైసీపీ నాయకులు పట్టు కోసం పాట్లు

కోసిగి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కామన్‌దొడ్డి గ్రామంలో గత రెండు రోజుల క్రితం మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలు వైసీపీ వీడి టీడీపీలో చేరారు. వైసీపీకి గ్రామంలో పట్టు కోల్పోవడంతో గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఈడిగ నరసింహులు గౌడు, సర్పంచ్ మునెమ్మ కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ఇంటికి పిలిచి బలవంతంగా తమకు వైసీపీ కండువాలు వేశారని, గ్రామానికి చెందిన దళితులు హరిజన అడివప్ప, ఎల్లప్ప అబ్రహం తెలిపారు. వీరితో పాటు వైసీపీ నాయకులకే మళ్లీ వైసీపీ కండువాలు వేసి టీడీపీ నుంచి వైసీపీలోకి చేరారని నరసింహులు గౌడు చెప్పడం ఆయనకు మతిభ్రమించిందని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మల్లి ఈరేష్, దొడ్డయ్య ఆరోపించారు. ఒకేరోజు దళితులకు వైసీపీ, టీడీపీ కండువాలు కప్పడం గ్రామంలో చర్చనీయాంశమైంది.

## రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్ల కంప తొలగింపు

మంత్రాలయం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని సూగూరు, బూదూరు, వి.తిమ్మాపురం, వగరూరు గ్రామాలకు వెళ్లే దారిలోని ముళ్లకంపలను యంత్రాలతో తొలగించే కార్యక్రమానికి మంగళ వారం శ్రీకారం చుట్టారు. మంగళవారం టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ అధికారులు ముళ్లకంపలను తొలగించారు. దాదాపు 16 కిలోమీటర్ల మేర ముళ్ల కంపలు ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కల్లుదేవకుంట సింగిల్ విండో అధ్యక్షురాలు రాగమ్మ, పవన్ కుమారరెడ్డి, గోపాల్, లింగప్ప, తదితరులు పాల్గొన్నారు.



## నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

కోసిగి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాటి కాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కాటికాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు అన్నారు. మంగళవారం కోసిగిలో కాటి కాపరులతో సమావేశం నిర్వహించారు.

**మండల నూతన కమిటి ఎన్నిక**

కోసిగి మండల కాటికాపరుల నూతన మండల కమిటీని మండల అధ్యక్షుడు ఆనంద్‌బాబు ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆవుల నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా రామకోటి పిలిప్‌తో పాటు మరో 19 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

## వైసీపీని బలోపేతం చేయాలి : ఎస్వీ మోహన్‌రెడ్డి

నందవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీని బలోపేతం చేసి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి నాయకులకు పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే కేఆర్ హనుమంతరెడ్డి మనవడు, మాజీ సర్పంచ్ కేఆర్ రామకోటిరెడ్డి, సోమలగూడురు వెంకటేశ్వరరెడ్డి ఎస్వీ దంపతులను కలిశారు. నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతి నాయకుడిని, కార్యకర్తను అదిష్టానం మర్చిపోద న్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటాపురంలో సెల్‌ఫోన్ ఇవ్వలేదని ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసింతే. విషయం తెలుసుకున్న టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు మాచాని మహేష్, నాయకులు మిన్నప్ప, బుగిడే నాగరాజు, నరసిం హులు, పెద్ద రంగన్న, బచ్చాల రగన్నలు మంగళవారం బాలుడు తండ్రి రాజశేఖర్‌ను పరామర్శించారు. అలాగే రూ. 5వేలు ఆర్థికసాయం అందజేశారు.